


# నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి



## కోదాడ పటేల్ నగర్‌లో ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు



కోదాడ – ఆగస్టు 11 (సత్యనిష్ఠ), ఆషాఢ మాసాన్ని పురస్కరించు కుని కోదాడ పట్టణంలోని పటేల్ నగర్‌లో గోరింటాకు వేడుకలను మంగళవారం మహిళలు ఆనందోత్సాహాల మధ్య, సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒకరి కొకరు గోరింటాకు పెట్టు కుంటూ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాల్లో గోరింటాకు కేవలం అలంకారం మాత్రమే కాదని, అది ఆనందాని కి, సౌభాగ్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టు కోవడం వల్ల ఆరోగ్యంతో పాటు మహిళల మధ్య ప్రేమానురాగాలు, సోదరభావం పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమాన్ని విజయ వంతం చేసిన మహిళలందరికీ ధన్యవాదాలు తెలపడంతో పాటు ఆషాఢ మాస శుభా కాంక్షలు తెలియజేశారు.

# యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్ట్‌లపై సీపీఎం ప్రజాఉద్యమం

- పాలకులు నిర్లక్ష్యం వీడి నిధులు విడుదల చేయాలి
- ఆగష్టు 29,30,31భువనగిరి నుండి హైదరాబాద్ పాదయాత్ర
- 31న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సీపీఎం మహాధర్నా
- సీపీఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్




భువనగిరి–ఆగస్టు 11 (సత్య నిష్ఠ): యాదాద్రి భువనగిరి జిల్లా సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించడంలో గత, ప్రస్తుత పాలకులు పూర్తిగా విఫలమయ్యారని వాటి పరిష్కారం కోసం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్ తెలిపారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కీలక ప్రాజెక్టులుగా ఉన్న బస్వాపురం ప్రాజెక్టు, గంధమల్ల ప్రాజెక్టు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, నవాబ్ పేట రిజర్వాయర్ ప్రాజెక్టు, చిన్న నీటి పారుదల కాలువలైన ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి, బునాదిగాని, ఆసిఫ్ నహర్ కాలువ పునరుద్ధరణ పనులు పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29, 30, 31తేదీలలో సీపీఎం చలో హైదరాబాద్ పేరిట రైతులు, నిర్వాసితులు,ప్రజలతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 29న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై 31న హైదరాబాద్ ఇందిరా ధర్నా చౌక్ కు చేరుకుంటుందన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే " మహా ధర్నా " లో రైతులు, వ్యవసాయ కార్మికులు, నిర్వాసితులు, వృత్తి దారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 90 శాతం పూర్తయిన బస్వాపురం ప్రాజెక్టుకు మిగతా నిధులు ఇవ్వడంలో జాప్యంపై వివరణ ఇవ్వాలన్నారు. సుమారు 420 కోట్లకు పైచిలుకు డబ్బులు నిర్వాసితులకు చెల్లించవలసి ఉందన్నారు. 80 కోట్లు మంజూరు చేసినట్లు చెబుతున్న ఫైనాన్స్ కమిటీ వద్ద సంవత్సరం నుండి నిధులు నిలిచిపోయాయి. అన్నారు. అరకోర, అత్తెసరు నిధులు కేటాయిస్తూ దశాబ్దాల తరబడి ప్రాజెక్టు పూర్తి చేయకుండా జాప్యం చేస్తున్నారని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. భూ నిర్వాసితుల రైతుల ఖాతాలో నిధులు జమ చేయాలన్నారు. పాలమూరి రంగారెడ్డి ప్రాజెక్టు ఎదుల రిజర్వాయర్ ద్వారా డిండి ప్రాజెక్టుకు నీళ్లు తేవాలన్నారు. డిండి ప్రాజెక్టు ద్వారా రాచకొండ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి రిజర్వాయర్ ద్వారా నారాయణపూర్, చౌటుప్పల్ మండలాల గ్రామాలకు గ్రావిటీ ద్వారా సాగు నీరు అందించాలని కోరారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా నవాబుపేటకు నీళ్లు ఇస్తామని సుమారు 15 సంవత్సరాల కింద కాల్వలు తోవ్వారని కానీ అందులో నీళ్లు లేక నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువ వెడల్పు పనులు నిలిచిపోయాయి అన్నారు. పిలాయిపల్లి, బునాదిగాని కాలువల పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కాలువల కింద 30 కల్వర్టులు కట్టవలసి ఉందన్నారు. జిల్లాలో మూసి ప్రక్షాళన, గోదావరి జలాలు అనుసంధానంకై ప్రభుత్వం దగ్గర డిపిఆర్ లేదని విమర్శించారు. బస్వాపురం ప్రాజెక్టు ద్వారా చెరువులు నింపడానికి పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించి నిధులు కేటాయించాలని, శామీర్పేట కాల్వ ద్వారా బొమ్మలరామారం, బీబీనగర్, భువనగిరి, పోచంపల్లి మండలాలకు సాగునీరు అందించాలన్నారు. ఈ నెల 16న సాగు తాగునీటి సమస్య పరిష్కారం కోసం వివిధ రాజకీయ పక్షాలతో, ప్రజాసంఘాలతో, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 31న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నాకు పెద్ద ఎత్తున అన్ని వర్గాలు తరలిరావాలని యండి జహంగీర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

# గుడికి భూమి మాకు సంబంధించినది

- కొంతమంది కబ్జా చేయడానికిప్రయత్నాలు చేస్తున్నారు
- భూమి ఇవ్వకపోతే ఊరు నుండి వెళ్ళిపోమని అంటున్నారు
- అయిటిపాముల గ్రామస్తుడు బొజ్జ అజయ్ కుమార్




నల్లగొండ–ఆగస్టు 11( సత్య నిష్ఠ) నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం ఐయిటిపాముల గ్రామం లోని ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న భూమి తనది అని గ్రామానికి చెందిన బొజ్జ అజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి సమీపంలో 30 గుంటల భూమి ఉన్నదని అన్నారు. ఆ భూమి 821 సర్వే నెంబర్లు ఉందని అన్నారు.తన నాన్న బొజ్జ నరసింహ తన బాబాయిలు బొజ్జ చంద్రయ్య , బొజ్జ ఎల్లయ్య పేరు మీదుగా ఉందని అన్నారు. 30 గుంటల భూమిలో మనిషికి 10 గంటల వరకు భూమి వాటాలుగా వచ్చే అవకాశం ఉందన్నారు. తమ గ్రామంలోని కొందరు తమకు పడని వాళ్ళు భూమిని గుడి పేరు మీదగా కబ్జా చేయాలని చూస్తున్నారని అన్నారు. గుడి కట్టడానికి భూమి ఇవ్వకపోతే గ్రామం నుండి వెళ్లిపోవాలని తమను ఆదేశిస్తున్నారని అన్నారు. ప్రస్తుత సమాజం ఎటువైపు వెళుతుందో అర్థం కావడం లేదని అన్నారు. కావాలనే తమని రెచ్చగొడుతున్నారని అన్నారు.తమది ఒరిజినల్ పట్టా భూమి అని అన్నారు. తాను గుడి కట్టవద్దు అని అనడం లేదని వేరేచోట కట్టండి అని అంటున్నారని అన్నారు. తమ భూమిని కబ్జా చేసే వారి నుండి తమకు ప్రాణహాని ఉందని అన్నారు. తమపై దాడి చేసే అవకాశం కూడా ఉందని అన్నారు. ఇదే విషయమై కట్టంగూర్ పోలీస్ స్టేషన్లో ఇదివరకే ఫిర్యాదు చేయడం జరిగింది అన్నారు. రాజ్యాంగంలో ఏ పని చేసినా పక్కవారికి ఇబ్బంది కలగకుండా చేయాలి అని ఉంది అని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

# ఎం జి యు పి జి మూడో సెమిస్టర్ తరగతులు ప్రారంభమైనవి

- రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి

నల్లగొండ–ఆగస్టు 11( సత్య నిష్ఠ): ఎం జి యు పిజి మూడవ సెమిస్టర్ తరగతులు ప్రారంభం అయిన దృష్ట్యా విద్యార్థులు విధిగా తరగతులకు హాజరు కావాలని రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి తెలిపారు. 75% హాజరు లేని విద్యార్థులను పరీక్షలకు అనుమతించరని, కావున విద్యార్థులు విధిగా హాజరు కావాలని ఆయన తెలిపారు.

## అభయాంజనేయ స్వామి దేవాలయంలో అన్నదానం



**కోదాడ – ఆగస్టు 11 (సత్యన్నిష్ట)** పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో 209 వ మంగళవారం ను పురస్కరించు కుని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమన్ని ఆలయ కమిటీ సభ్యులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమా లు నిర్వహించారు. అనంతరం నెలవారి దాతలు సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానాన్ని ప్రారంభించారు. ఆంజనే య స్వామి కరుణా కటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జూకూరి అంజయ్య, అన్నదాన నిర్వాహకులు డి హనుమం తరావు, వి కృష్ణ మూర్తి, సెక్రటరీ తిరుప తయ్య, శిరీష, బ్యాటరీ చారి ఉమా మహేశ్వర రావు, పెద్ది శేషు, ఆకుల పుల్లారావు, క్రాంతి బిఎల్ఎన్ రెడ్డి, బి సత్యం, వి రామారావు, కె రవి కుమార్, డాక్టర్ శ్రీకాంత్, పీ శ్రీనివాసరావు రామకృష్ణ, పవన్, సతీష్, రంగా, శ్రీను, ప్రకాష్, లక్ష్మారెడ్డి, నరేష్, గాంధీ, వి రాంప్రసాద్, వెంకట కృష్ణ, విశాల్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో డిఆర్ఓకు వినతిపత్రం



**నల్లగొండ-ఆగస్టు 11( సత్య నిష్ఠ )**

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ( ఆర్.టి.ఐ-2005 ) జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి సూచన మేరకు నల్గొండ జిల్లా అధ్యక్షులు సిద్ధం వెంకన్న ఆధ్వర్యంలో డిఆర్ఓ ఆర్ దశరథ కి వినతి పత్రం సమర్పించడం జరిగినది జిల్లాస్థాయిలో సమాచార హక్కు చట్టం 2005 సమగ్రంగా అమలు కోసం, జిల్లా సమాచార హక్కు చట్టం కమిటీ ఏర్పాటు కోసం జిల్లాస్థాయి మానిటరింగ్ మెంబర్స్ ఏర్పాటు వ్యవస్థ పునరుద్ధరణ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సహాయ కేంద్రం ఏర్పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మరియు సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి ప్రాధాన్యత కల్పించడం రాష్ట్ర ప్రభుత్వానికి మరియు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కి మా సమాచార హక్కు చట్టం సాధన కమిటీని సిఫార్సు చేయవలెనని కోరడం జరిగినది ఈ వినతిపత్రం సమర్పించుటకు కమిటీ సభ్యులైన వైస్ ప్రెసిడెంట్ బైరు రవి,సెక్రటరీలు పెరుమాండ్ల లక్ష్మయ్య, బండారు జలంధర్ మరియు తక్కెళ్ళపల్లి విజయ్, జాయింట్ సెక్రటరీ వెంకటకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

- **తాండూర్--వికారాబాద్ రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి నిరసన**
- **హామీలు అమలు చేయకుంటే రేవంత్ ప్రభుత్వంపై రాష్ట్రవ్యాప్త దండయాత్ర**
- **కొడంగల్‌లో లక్ష మందితో ఆవేదన సభ నిర్వహిస్తాం**
- **భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్**




**వికారాబాద్-ఆగస్టు 11 (సత్య నిష్ఠ)**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ ఆధ్వర్యంలో వికలాంగుల ఉద్యమం మరోసారి ఉధృతమైంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ గడ్డపై గర్జించిన గిద్దె రాజేష్, మంగళవారం సంఘం నాయకులు, కార్యకర్తలతో కలిసి స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సమీపంలో ఉన్న తాండూర్--వికారాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వికలాంగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వికలాంగుల సమస్యలను విస్మరించడం సరికాదని అన్నారు. ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్లను రూ.6,000కు పెంచుతామని, వికలాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, తెలంగాణలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని, రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని, ప్రభుత్వ శాఖల్లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గిద్దె రాజేష్ గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఇచ్చిన మాటలుగా మిగిలిపోకూడదని, వికలాంగులు కూడా ఈ రాష్ట్రానికి సమాన హక్కులు కలిగిన పౌరులేనని ఆయన అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ బాధ్యత అని, ఇచ్చిన హామీలతోపాటు రాష్ట్రంలో వికలాంగుల అభ్యున్నతికై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.10 లక్షలతో 'వికలాంగుల బంధు' పథకాన్ని ప్రవేశపెట్టి ఆసరా పింఛను వచ్చే ప్రతి వికలాంగునికి వికలాంగుల బంధు వర్తింపజేయడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో వికలాంగులకు ఉన్న 5 శాతం రిజర్వేషన్‌ను 100 శాతానికి పెంచి, ఆసరా పింఛన్ పొందుతున్న ప్రతి అర్హత కలిగిన వికలాంగులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, రాష్ట్రంలో వెంటనే నూతన పింఛన్లు విడుదల చేయాలని గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు రాకుంటే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పై దండయాత్ర చేపట్టి, కొడంగల్‌లో లక్ష మందితో 'వికలాంగుల ఆవేదన సభ' నిర్వహిస్తామని గిద్దె రాజేష్ ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నరసింహులు, సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పసుల చంద్రయ్య, సంఘం రాష్ట్ర నాయకులు, వికారాబాద్ జిల్లా ఇంచార్జ్ పోతురాజు సుధీర్, సంఘం రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యవర్గ సభ్యులు కడియ నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. చుక్కయ్య, పరిగి డివిజన్ నాయకులు లక్ష్మయ్య, సంఘం నూతన నాయకులు బొంపల్లి ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, నారాయణ, జంగయ్య, యాదయ్య, జే. రాములు, మహిళా నాయకురాళ్లు లక్ష్మి, భాగ్యమ్మ, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉరడి హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ విజయవంతంగా ముగిసింది

- **బిఎల్ఏ కృషి అభినందనీయం**
- **దేవరకొండ మాజీశాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ-ఆగస్టు 11( సత్య నిష్ఠ )**

ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ విజయవంతంగా ముగియడంలో బూత్ లెవల్ ఏజెంట్లు అందించిన సేవలు, చూపిన నిబద్ధత అభినందనీయమని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ, అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడటంతో పాటు అనర్హులైన ఓటర్లను గుర్తించే ప్రక్రియలో బి ఎల్ ఏ



లు చూపిన నిబద్ధత, పట్టుదల, బాధ్యత ప్రశంసనీయమన్నారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులు, అనర్హుల వివరాలను గుర్తించడం వంటి ప్రక్రియలో బి ఎల్ ఏ కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఎండ, వానలను లెక్కచేయకుండా ప్రజల వద్దకు వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన ప్రతి బి ఎల్ ఏ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని రమావత్ రవీంద్ర కుమార్ ఆకాంక్షించారు.

# 1/70 ఎల్‌టిఆర్ చట్టం పరిరక్షణపై జాతీయ ఎస్టీ కమిషన్ సంచలన నిర్ణయం!

- ఏపీ, తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు నోటీసులు జారీ
- 15 రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని తీవ్ర ఆదేశాలు
- ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోరాటానికి దక్కిన తొలి విజయం

వి.ఆర్ పురం-సత్య నిష్ఠ

పోలవరం జిల్లా ఎటపాక -భద్రాచలం ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగ హక్కులను కాపాడే 1/70 భూ బదిలీ నిరోధక చట్టం ఎల్ టి ఆర్ 1/70) సమర్ధవంతమైన అమలుపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఎన్ సి ఎస్ టి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఎ ప్రకారం తనకు సంక్రమించిన విశేష అధికారాలతో.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గిరిజన సంక్షేమ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలకు జాతీయ ఎస్టీ కమిషన్ అత్యవసర నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ఏ వి ఎస్ పి తెలుగు రాష్ట్రాల కన్వీనర్) కుంజా శ్రీను సమర్పించిన చారిత్రాత్మక ఫిర్యాదు/వినతిపత్రం (తేదీ: 23-07-2026,) ఆధారంగా స్పందించిన కమిషన్ డైరెక్టర్ డాక్టర్ పి. కళ్యాణ్ రెడ్డి, ఫైల్ నంబర్ ఎన్ సి ఎస్ టి /డి ఇ వి -8482/ఏపీ /485/2026-ఆర్ ఒ బిహెచ్ యు వి /ఆర్ యు -xxx ద్వారా ఈ కీలక ఉత్తర్వులు జారీ చేశారు.




కమిషన్ జారీ చేసిన 15 రోజుల్లో నివేదిక సమర్పించాలి: రెండు రాష్ట్రాల ప్రిన్సిపల్ సెక్రటరీలు ఎల్టిఆర్ 1/70 చట్టం పరిరక్షణపై చేపట్టిన చర్యలు, సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్లపై నోటీసు అందిన 15 రోజుల్లోగా సమగ్ర నివేదికను పంపాలని ఆదేశించారు.

నిర్ణీత 15 రోజుల వ్యవధిలో రెండు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పందన లేకపోతే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 338ఎ(8) ప్రకారం సివిల్ కోర్టు అధికారాలను ఉపయోగించి అధికారులను స్వయంగా కమిషన్ ముందుకు సమన్లు జారీ చేసి హాజరుపరుస్తామని హెచ్చరించారు.


సుప్రీంకోర్టు వ్యాజ్యాలు ఆదివాసీల మనుగడపై దాడి: ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ: "ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం అనేది ఆదివాసీల మనుగడకు, భూహక్కులకు రాజ్యాంగపరమైన రక్షణ కవచం. 1874 నాటి షెడ్యూల్డ్ డిస్ట్రిక్ట్స్ యాక్ట్, 1917 నాటి ఏజెన్సీ ట్రాక్ట్స్ యాక్ట్ నుంచి మొదలై, 1959, 1970, 1978 సవరణల ద్వారా బలపడిన ఈ చట్టాన్ని సవాలు చేస్తూ నాన్-ట్రైబల్స్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లను ఎదుర్కోవడంలో ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ప్రభుత్వాల బలహీనమైన వైఖరి వల్ల ఏజెన్సీలో ఆదివాసీల భూములు కబ్జాల పాలవుతున్నాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ కమిషన్‌కు కమిషన్ను సమర్పించిన ప్రధాన అంశాలు: 1874 నుంచి ఉన్న చారిత్రక చట్టపరమైన ఆధారాలను పొందుపరుస్తూ సీనియర్ రాజ్యాంగ నిపుణులతో సుప్రీంకోర్టులో బలమైన కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలనీ, రెండు తెలుగు రాష్ట్రాల ఏజెన్సీ పరిధిలోని రంపచోడవరం, పాడేరు, చింతూరు, భద్రాచలం, ఏటూరునా గారం, ఉట్నూరు తదితర అన్ని ఐటిడిఏ బెల్టులలో అక్రమంగా గిరిజన భూములు ఆక్రమించిన నాన్-ట్రైబల్స్‌పై సెక్షన్ 3(5) ప్రకారం తక్షణ తొలగింపు ,ఏవిక్షన్ సెక్షన్ 6ఎ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. సుమారు 1,700 మంది నాన్-ట్రైబల్ పట్టాలపై స్పెషల్ రెవెన్యూ ఆడిట్: 1970 కంటే ముందు నాటి భూమి రికార్డులను సమగ్రంగా విచారించి, నకిలీ పట్టాలు, బెనామీ లావాదేవీలను తక్షణమే రద్దు చేయాలని అలాగే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల లా సెక్రటరీలు, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీలు, అడ్వకేట్ జనరల్స్ మరియు ఆదివాసీ ప్రతినిధులతో జాతీయ కమిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలి అని ప్రభుత్వాలను ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. ఆదివాసీల భూహక్కుల పరిరక్షణ కోసం, ఏజెన్సీ చట్టాల పకడ్బందీ అమలు కోసం ఆదివాసీ సంక్షేమ పరిషత్ చట్టబద్ధంగా, పోరాట రూపంలో తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## తెలంగాణ మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న వారసులు కళాకారులు

- టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ

హైదరాబాద్ -ఆగస్టు 11 (సత్య నిష్ఠ)

తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, తెలంగాణ అంటే ఒక జీవన సంస్కృతి... తెలంగాణ అంటే ఆట, పాటల పుట్ట... తెలంగాణ అంటే విభిన్న సంస్కృతుల, సంప్రదాయాల గడ్డ... తెలంగాణ అంటే పల్లె మట్టి పరిమళమని, ఆ మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న గొప్ప వారసులు మన జానపద కళాకారులని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. మంగళవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, గాజుల రామారంలోని పద్మావతి కన్వెన్షన్ లో, "కలాలు, గలాల వేదిక" నిర్వహించిన బోనాల కళా జాతరకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రముఖ



ప్రజా గాయకుడు దరువు అంజన్న ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, పుస్తకాల్లో లేని చరిత్రను పాటల ద్వారా ప్రజలకు నేర్పి, వారిని చైతన్య పరిచేవాళ్ళే ప్రజా కళాకారులని, సామాన్యుల జీవితాలను, రైతుల కష్టాలను, కూలీల మహిళల భావాలను, పల్లె జీవనాన్ని తమ కళలో ప్రతిబింబించిన ఘనత కళాకారులకే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. కళాకారుడి చేతిలోని డప్పు కేవలం ఒక వాయిద్యం మాత్రమే కాదని, అది ప్రజల గుండె చప్పుడని, అతని గొంతులో వినిపించే పాట కేవలం వినోదం మాత్రమే కాదని, అది సమాజానికి ఒక సందేశం, ఒక చైతన్యమని ఆయన పేర్కొన్నారు. అందుకే కళాకారుడిని కేవలం వినోదం అందించే వ్యక్తిగా కాకుండా, ఒక చరిత్రకారుడిగా, ఒక సామాజిక కార్యకర్తగా, ఒక చైతన్యవంతుడిగా, ప్రజల గొంతుకగా చూడాలని విరాహత్ అలీ అన్నారు. కళ బతికితే సంస్కృతి బతుకుతుందని, సంస్కృతి బతికితే సమాజం బతుకుతుందని, సమాజం బతికితే మన అస్తిత్వం బతుకుతుందని ఆయన స్పష్టం చేసారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జి. బాల్ రాజ్ గౌడ్ తో పాటు కళాకారులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.